## క్లుప్తంగా

### కేటీఆర్ సభను విజయవంతం చేయాలి



గట్టు: జిల్లాకేంద్రంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మంత్రి కేటీఆర్ ఈ నెల 8న రానున్నట్లు జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ జంబురామన్‌గౌడు, ఎంపీపీ విజయ్ కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటేష్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డిలు తెలిపారు. గురువారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా కేంద్రంలో నూతన బస్టాండ్, ఇంటిగ్రేడ్ మార్కెట్, డబుల్ బెడ్రూంల ప్రారంభోత్సవం ఉంటుందని తెలిపారు. అనంతరం భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, ఎంపీటీసీ ఆనంద్‌గౌడు, నాయకులు వెంకటన్న, నారాయణ, సంతోష్ పాల్గొన్నారు.

### పోలింగ్ బూత్‌ల సమీక్ష



మాట్లాడుతున్న కేశవరావు

అయిజ: మండలంలోని ఉప్పలలో గురువారం బీఎస్పీ అలంపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మధుగౌడ్ ఆధ్వర్యంలో బీఎస్పీ పోలింగ్ బూత్ కమిటీల సమీక్ష నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు కేశవరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. త్వరలో ఎన్నికలు రానున్నాయని, దొరల గడిలో బంది అయిన తెలంగాణ రాష్ట్రాన్ని విముక్తి చేసేందుకు పార్టీని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు తిరుపాల్, ప్రధాన కార్యదర్శి రవిచందర్, మండల అధ్యక్షుడు వీరన్న, ప్రధాన కార్యదర్శి సురేందర్ పాల్గొన్నారు.

### విశ్వరూప పాదయాత్ర పోస్టర్ విడుదల



ధరూరు: ఈ నెల 7న అలంపూర్‌లో నిర్వహించే మాదిగల విశ్వరూప పాదయాత్ర పోస్టర్‌ను గురువారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు చిన్నపాడు ఆంజనేయులు మండల కేంద్రంలో విడుదల చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అలంపూర్ నుంచి హైదరాబాద్‌కు చలో పాదయాత్రను ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంజీవ్, సత్యన్న పాల్గొన్నారు.

మానవపాడు: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ముందు అక్టోబర్ 7న చలో హైదరాబాద్ మహాపాదయాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ జయరాజు ఆధ్వర్యంలో విడుదల చేశారు. కార్యక్రమంలో గూట విజయ్, మాదిగ రాజేష్, ఇమ్మనియేలు, ప్రేమ్, జయన్న, మద్దిలేటి పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ధరూరు: మండలంలోని వామన్‌పల్లికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు కల్లు గోపాల్(40) మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచు పెద్ద ఆంజనేయులు, ఉప సర్పంచు, పంచాయతీ కార్యదర్శిలు అతని దహన సంస్కారాలకు రూ.10వేలు అందజేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

### మంత్రికి వినతులు

అలంపూర్/ఉండవెల్లి: అలంపూర్ చౌరస్తాలోని 100 పడకల ఆస్పత్రి ప్రారంభానికి విచ్చేసిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డికి నియోజకవర్గంలోని ఆశా కార్యకర్తలు వినతి పత్రం అందజేశారు. వారి డిమాండ్లను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని, కనీస జీతభత్యం అందించాలని కోరారు. అనంతరం తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఈదన్న, నాయకులు మద్దిలేటి రైతులకు రుణమాఫీ అందలేదని మంత్రికి తెలిపారు.

### విద్యార్థులకు ట్రై సైకిళ్ల పంపిణీ



దివ్యాంగులకు సైకిళ్లు అందజేసిన అధికారులు

కేటీదొడ్డి: మండలంలోని వివిధ గ్రామాల్లో చదువుతున్న దివ్యాంగులకు ప్రభుత్వం నుంచి మంజూరైన ట్రై సైకిళ్లను గురువారం ఎంఈఓ సురేష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నడవలేని స్థితిలో ఉన్న విద్యార్థులను గుర్తించి ఆరు ట్రై సైకిళ్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీలు యుగంధర్, పాపయ్య, ఐఈఆర్సీపీలు రంజిత్, శంకర్ పాల్గొన్నారు.

# నిధులున్నా.. నిరీక్షణ!

- పంచాయతీ నిధులపై ఫ్రీజింగ్..
- అధికారుల ఒత్తిడితో అప్పుల పాలు..
- నిధులు రాక సర్పంచ్‌ల తిప్పలు..



కోదండాపురం గ్రామ పంచాయతీ కార్యాలయం





తిమ్మాపురంలో గ్రామ సభను నిర్వహించిన సర్పంచ్ (ఫైల్)

ఎర్రవల్లిచౌరస్తా: 'ముందు నుయ్యి.. వెనక గొయ్యి' అన్నట్లుగా మారింది నియోజకవర్గంలోని గ్రామ పంచాయతీల్లోని సర్పంచ్‌ల పరిస్థితి. అభివృద్ధి పనులు చేయకపోతే ఎందుకు చేయటం లేదని జిల్లా అధికారుల నుంచి అక్షింతలు.. ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. అష్టకష్టాలతో అప్పులు చేసి పనులు చేసినా, నెలలు గడుస్తున్నా బిల్లులు రాక అప్పులిచ్చిన వారికి సమాధానం చెప్పలేక సర్పంచ్‌లు ఇబ్బందులకు గురవుతున్నారు. పంపించిన చెక్కులు చాలా వరకు ట్రెజరీ నుంచి తిరిగి వచ్చాయి. దీంతో బిల్లులు విడుదల కాక పనులు ఎలా చేసేదంటూ సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పంచాయతీ నిధుల ఖర్చులు..**

పల్లెప్రగతి అభివృద్ధి పనులు, హరితహారంలో మొక్కల సంరక్షణ, పారిశుద్ధ్య పనులు, తాగునీటి విడుదల, పంచాయతీ ట్రాక్టర్‌కు డీజిల్, సిబ్బంది వేతనాలు, ఇలా పంచాయతీలో అన్ని సజావుగా సాగుతున్నా చేసిన పనులకు ట్రెజరీ నుంచి మాత్రం నిధులు విడుదల కావడం లేదు. పంచాయతీల్లో 15వ ఆర్థిక సంఘం నిధులు, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నిధులు జీపీ ఖాతాలో జమ అవుతున్నాయి. బిల్లుల కోసం ట్రెజరీకి చెక్కులు పంపితే పలు కారణాలతో అధికారులు తిరిగి వెనక్కి పంపిస్తున్నారు. సకాలంలో నిధులు రాక, అప్పులు తీర్చలేక సర్పంచులు ఇబ్బందులకు గురవుతున్నారు.

| క్రసం | మండలం | పంచాయతీలు |
|---|---|---|
| 1. | ఇటిక్యాల | 29 |
| 2. | మానవపాడు | 16 |
| 3. | ఉండవెల్లి | 16 |
| 4. | అలంపూర్ | 14 |
| 5. | రాజోలి | 11 |
| 6. | వడ్డేపల్లి | 10 |
| 7. | అయిజ | 28 |

**నియోజకవర్గంలోని పరిస్థితి..**

అలంపూర్ నియోజకవర్గంలో మొత్తం ఏడు మండలాల్లో 124 గ్రామ పంచాయతీలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పల్లెల్లో అభివృద్ధికి పల్లె ప్రగతి పేరుతో ప్రతినెలా పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు కేటాయిస్తున్నాయి. పంచాయతీల్లో పన్ను రూపంలో సేకరించిన నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నిధులు సక్రమంగా వస్తే పంచాయతీలు పాలన సజావుగా సాగుతుంది. ఈ నిధుల విడుదలలో ఏర్పడుతున్న అవాంతరాల వల్ల పంచాయతీల నిర్వహణ అధ్వానంగా మారింది. ప్రభుత్వం ఇటీవల తండాలను, చిన్న గ్రామాలను పంచాయతీలుగా మార్చింది. వాటికి నిధుల విడుదలలో ఏర్పడిన ప్రతిష్టంభన, ఆర్థిక సంక్షోభంతో పంచాయతీలు కొట్టుమిట్టాడుతున్నాయి.

**ఫ్రీజింగ్ అవుతున్న ఖాతాలు..**

గ్రామ పంచాయతీలలో పారిశుద్ధ్య పనులు, విద్యుత్ అవసరాలు, తాగునీటి సరఫరా, నర్సరీల నిర్వహణ, ప్రకృతి వనరులు, ఇతర మరమ్మతు పనులకు నిధులను ఆయా పంచాయతీ ఖాతాల నుంచి సర్పంచులు ట్రెజరీల ద్వారా డ్రా చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం పనులకు సంబంధించిన బిల్లులను సిద్ధం చేసి చెక్కులను ట్రెజరీలకు పంపిస్తారు. గ్రామ పంచాయతీలో నిధులున్నా డ్రా చేసుకునేందుకు పంపిన చెక్కులు వెనకకు వస్తుండటంతో సర్పంచ్‌లు తలలు పట్టుకుంటున్నారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీలలో నిర్వహణ ఖర్చు ప్రతి నెల రూ.లక్షకు పైనే అవుతుంది. ట్రాక్టర్ డీజిల్‌కు రూ.20,000 అవుతుంది.

**సకాలంలో బిల్లులు విడుదల చేయాలి..**



రాష్ట్ర ప్రభుత్వం సూచించిన మేరకు పంచాయతీలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాం. నిధుల విడుదలలో జాప్యం వల్ల పనుల కోసం అప్పులు చేసిన దగ్గర సమాధానం చెప్పలేక, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యను గుర్తించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను సకాలంలో విడుదల చేయాలి.

– జోగుల రవి, సర్పంచ్, ఎర్రవల్లి

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..**



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పంచాయతీల ఖాతాల్లోకి నిధులు జమ అవుతున్నాయి. అన్నీ పంచాయతీ ఖాతాల్లో ప్రస్తుతం నిధులు ఉన్నాయి. ప్రభుత్వం సూచించిన నిబంధనల ప్రకారం మాత్రమే నిధులను డ్రా చేసేందుకు సర్పంచులకు వెసులుబాటు ఉంది. నిధుల జమ కావడం పట్ల ఏమైనా సమస్యలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తాం. – భాస్కర్, మండల పంచాయతీ అధికారి, ఇటిక్యాల

# మహిళల సంక్షేమానికి పెద్దపీట



బతుకమ్మ చీరలు పంపిణీ చేసిన సర్పంచ్

కేటీదొడ్డి: మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి అన్నారు. మండల పరిధిలోని నందిన్నె గురువారం బతుకమ్మ చీరల పంపిణీ ప్రారంభించారు. మహిళలకు సర్పంచ్ భీమరాయుడు చీరలు అందజేశారు. ఆడపడుచులకు ఇచ్చే కానుక వెలకట్టలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు దుబ్బరెడ్డి, ఆంజనేయులు, మహదేవ్, రాంబాబు పాల్గొన్నారు.

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం బతుకమ్మ చీరలు పంపిణీ కార్యక్రమానికి అధికారులు శ్రీకారం చుట్టారు. మండలంలోని తనగలలో ఎంపీడీఓ రవీంద్ర ఆధ్వర్యంలో బతుకమ్మ చీరల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని పది గ్రామ పంచాయతీల్లో 5,527 మంది మహిళలకు బతుకమ్మ చీరలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఎస్ మాజీ చైర్మన్ సీతారామిరెడ్డి, ఎంపీపీ రజిత, సర్పంచ్ రాణి, పంచాయతీ కార్యదర్శి మోహన్ పాల్గొన్నారు.

**బతుకమ్మ చీరల పంపిణీ**

రాజోళి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో గురువారం బతుకమ్మ చీరల పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల కేంద్రంలో సర్పంచ్ సరోజ ఆధ్వర్యంలో బతుకమ్మ చీరల పంపిణీ చేపట్టారు. కార్యక్రమానికి ఎంపీడీఓ రాఘవ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటేశ్వరమ్మ, కార్యదర్శి నాగరాజు, యుగేంధర్‌రెడ్డి ఉన్నారు.

# పోలీస్ ఉద్యోగం సాధించారు



పోలీస్ కొలువులు సాధించిన అలంపూర్ అన్నదమ్ములు ప్రేమ్, కిషోర్‌లు

**గట్టు మండలంలో 14 మందికి పోలీస్ ఉద్యోగాలు**

అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణానికి చెందిన ఏడుగురు యువతీ యువకులు సత్తాచాటి పోలీస్ కొలువులు సాధించారు. వారిలో సంతమార్కెట్ కాలనీకి చెందిన ఒకే కుటుంబంలోని అన్నదమ్ములకు ప్రేమ్‌కుమార్, కిషోర్‌కుమార్ టీఎస్ఎస్‌పీలో, అంబేద్కర్ కాలనీకి చెందిన ముద్దాసి మౌనిక, ముద్దాసి స్వర్ణలత, సివిల్‌కు, సంతోష్‌నగర్ కాలనీకి చెందిన ఆలీబాబు(సివిల్), కిరణ్ (టీఎస్ఎస్‌పీ), కుమ్మరివీధికి చెందిన వెంకటేష్‌లు పోలీస్ కొలువులు సాధించడంతో వారి కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

**చాలా ఆనందంగా ఉంది..**

అలంపూర్ పట్టణంలోని సంతమార్కెట్ కాలనీకి చెందిన అన్నదమ్ములు ప్రేమ్‌కుమార్, కిషోర్‌కుమార్‌లు సాక్షితో మాట్లాడుతూ మేమిద్దరం ఒకేసారి పోలీస్ కొలువులు సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు.

**అన్నదమ్ములకు పోలీస్ కొలువులు**

అయిజ: అయిజ పట్టణంలోని కొత్తపేటకు చెందిన కారు డ్రైవర్‌గా పనిచేసే చాంద్‌పాషా కుమారులు ఇద్దరు ముస్తాక్ (సివిల్) కానిస్టేబుల్, ఆఫ్రిద్ (ఏఆర్) కానిస్టేబుల్‌గా కొలువులు సాధించారు. అయిజ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న జయన్న కుమారుడు వినయ్‌కుమార్ (ఏఆర్) కానిస్టేబుల్‌గా ఎన్నికై య్యాడు. పట్టణానికి చెందిన రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ కుమారుడు అన్వేష్ కుమార్ బెటాలియన్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సంపాదించాడు.

గట్టు: మండల కేంద్రానికి చెందిన ఆరుగు యువకులు పోలీస్ ఉద్యోగాలను సాధించారు. వీరేంద్ర సాగర్ (బెటాలియన్), బోయ రామాంజనేయులు(బెటాలియన్), కుర్వ మల్లేష్(సివిల్), మీసాల రామాంజనేయులు,(బెటాలియన్), రాజ్‌కుమార్ (ఫైర్ కానిస్టేబుల్), ఉదయ్‌కుమార్(సివిల్)గా ఎంపికయ్యారు. బోయలగూడెం నుంచి ముగ్గురు లలిత, చిన్న వీరేష్, భీమేష్, మాచర్ల నుంచి రవి, ఆలూరు నుంచి సత్యం, మల్లంపల్లి నుంచి వీరేష్, గొర్లఖాన్‌దొడ్డి నుంచి సురేష్, తప్పెట్లమొర్సు నుంచి తిమ్మప్ప, చిన్నోనిపల్లె నుంచి రఘునాథ్‌గౌడు, వినీత్‌రెడ్డిలు పోలీస్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

ధరూరు: ఐదు మందిలో ఇద్దరు స్త్రీలు, ముగ్గురు పురుషులు ఎంపికయ్యారు. హరిజన్ బుడత వెంకటన్న కుమారుడు రాజేష్, హనుమంతు నాయుడు కుమార్తె బీ. ధనేశ్వరి, తెలుగు నర్సింహులు కుమార్తె లక్ష్మిలు సివిల్‌లో సత్తా చాటగా, చాకలి దేకన్న కుమారుడు అఖిల్ ఏఆర్‌లో, కురువ గుడ్డెన్న కుమారుడు ఆంజనేయులు టీఎస్ఎస్‌పీలో ఎంపికయ్యారు.

**ఉండవెల్లి మండలంలో 10 మంది..**

ఉండవెల్లి: మండలంలోని మండల కేంద్రంలో లక్ష్మణుడు, యోగేశ్వర్, మీనాక్షి, చిన్న ఆముదాలపాడులో అజయ్, మారమునగాలలో మౌనిక, చంద్రశేఖర్, మోహన్ భాబు, నాగరాజు, పుల్లూరులో తెలుగు హైమావతి, బొంకూరులో పుష్పలత, కలుగోట్లలో వెంకటేశ్వర్లు, ఇంకోకరు ఎంపికయ్యారు. ఫైరు, బెటాలియన్, సివిల్స్ ఉన్నట్లు తెలిపారు.

**మల్దకల్ మండలంలో 20మందికి..**

మల్దకల్: కానిస్టేబుల్ పరీక్ష ఫలితాల్లో మండలానికి చెందిన 20మంది నిరుద్యోగులు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మండలంలోని ఎల్కూరు గ్రామానికి చెందిన 10మంది, మద్దెల బండ పెద్దతండాకు చెందిన 6మంది, అమరవాయిలో ఒకరు, బిజ్వారంలో ఒకరు, మల్దకల్‌లో ఒకరు, తాటికుంటలో ఒకరు కానిస్టేబుల్ ఉద్యోగాలను సాధించారు. ఎల్కూరులో వెంకటేష్, కృష్ణ, ఇజుబిల్, లలిత, గిడ్డారెడ్డిలతో పాటు అమరవాయికు చెందిన సుంకన్న ఉద్యోగాలు సాధించారు. వీరిని ఎంపీపీ రాజారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డిలు అభినందించారు.

### యువకుడికి పోలీస్ స్టేషన్‌లో సన్మానం



బాధితుడు ధర్మన్నకు నగదును అందజేస్తున్న ఉప్పరి రవి

అయిజ: పట్టణంలోని పశువైద్యశాల ముందు రోడ్డుపై ఉన్న రూ.50వేల నగదును బుధవారం పోలీసులకు అప్పగించిన ఉప్పరి రవిని గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ నరేష్‌కుమార్ శాలువా, పూలమాలతో సన్మానించారు. ఆయన చేతుల మీదుగా బాధితుడు ధర్మన్నకు నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రైతు ధర్మన్న తను పండించిన పంటను అమ్మేయగా వచ్చిన డబ్బును ఇంటికి తీసుకెళ్తుండగా జారి రోడ్డు మీద పడిపోయిందని, దాన్ని ఉప్పరి రవి పోలీసుస్టేషన్‌లో అప్పగించడంతో విచారణ చేపట్టి బాధితుడికి నగదును అందజేసినట్లు తెలిపారు.

### రాబోయే ఎన్నికల్లో ఆదరించండి



శాంతినగర్‌లో చార్జిషీట్ కరపత్రాలను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

శాంతినగర్: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించాలని కోరుతూ వడ్డేపల్లి పురపరిధిలోని పదో వార్డులో కాంగ్రెస్ నాయకులు గురువారం ప్రచారం నిర్వహించారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ ఆదేశాల మేరకు పదో వార్డులో గడపగడపకు తిరిగి కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో నియో జకవర్గ అబ్జర్వర్ సునీత, కౌన్సిలర్ దేవేంద్ర, టౌన్ ప్రసిడెంట్ వెంకట్రామన్, కృష్ణకాంత్, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

### హామీలు నెరవేర్చడంలో మోసం

అలంపూర్ రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ శేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని క్యాతూర్‌లో గురువారం తిరగబడదాం-తరిమికొడదాం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాము, బాలేశ్వర్‌రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని చాగాపురంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో తిరగబడుతాం-తరిమికొడదాం కార్యక్రమం నిర్వహించారు. నాయకులు రాజ్‌కుమార్, అల్లబకాష్, చాంద్‌బాషా, స్వాములు, లింగన్న, శివ, మహేష్ ఉన్నారు.

అయిజ: మండలంలోని ఎక్లాస్‌పురంలో కాంగ్రెస్ నాయకులు ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ప్రచారం నిర్వహించా రు. డీసీసీ సెక్రటరీ రాజు హాజరయ్యారు. కార్యక్రమంలో ఈరన్న గౌడ్, రాజశేఖర్, నాగరాజు, సులోమాను, మహేష్, మార్కు, కృష్ణ, రంగన్న, ప్రసాద్, పాల్గొన్నారు.

# అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు

**గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి**



కళ్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: అన్ని వర్గాల ప్రజలకు అండగా సీఎం కేసీఆర్ అహర్నిషలు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఆయన గద్వాల పట్టణంలోని 32వ వార్డులో నూతనంగా నిర్మించిన వడ్డెర కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. విద్యాభివృద్ధికి తనవంతు సహకారం ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. కేసీఆర్ స్టడీసర్కిల్‌లో కోచింగ్ తీసుకున్న అభ్యర్థులు పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా వారికి తన క్యాంపు కార్యాలయంలో సన్మానం చేశారు. స్టడీసర్కిల్‌లో కోచింగ్ తీసుకున్న 56 మంది పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించడం సంతోషంగా ఉందన్నారు.

**బీఆర్ఎస్ పార్టీలో చేరిక**

ప్రభుత్వం అమలు చేస్తున్న పలు అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్ పార్టీలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సమక్షంలో చేరారు. క్యాంపు కార్యాలయంలో గద్వాల మండలం శెట్టిఆత్మకూరుకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులకు పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు.

గట్టు: కేసీఆర్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. గట్టులోని రైతు వేదికలో 69 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

**కేసీఆర్ క్రీడా కిట్ల పంపిణీ**

యువకులకు కేసీఆర్ క్రీడా కిట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. పోలీస్ ఉద్యోగాలు సాధించిన యువకులను అభినందించి సన్మానించారు. మండలంలోని కొత్తపల్లిలో అదనపు తరగతి గదులు, భోజనశాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం యువతకు కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ జంబురామన్‌గౌడు, ఎంపీపీ విజయ్‌కుమార్, వైస్ ఎంపీపీ సుమతి, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్ ఉన్నారు.

**ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు**

మల్దకల్: మండల కేంద్రంలోని రైతువేదికలో బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# ఓట్లకోసమే నోటిఫికేషన్లు



నిరసన వ్యక్తం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

గద్వాల అర్బన్: ఎన్నికల సమీపిస్తుండంతో ఓట్ల కోసం నోటిఫికేషన్లు ఇస్తూ పేపర్ లీకేజీలతో నిరుద్యోగుల జీవితాలు రోడ్లపైకి ఈడ్చారని ఏబీవీపీ కన్వీనర్ సురేష్ మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే గ్రూప్–1ప్రిలిమ్స్ పరీక్ష రెండోసారి రద్దైందని గురువారం జిల్లా కేంద్రంలోని పాతబస్టాండులో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష నిర్వాహణలో బయోమెట్రిక్ వివరాలు, హాల్ టికెట్ నంబర్ లేకుండా ఓఎంఆర్ షిట్ ఇచ్చి అసైంటిఫిక్‌గా నిర్వహించారని, దీంతో పలువురు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించడంతో రెండోసారి పరీక్ష రద్దు అయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనైతికంగా నిరుద్యోగుల పట్ల శాపంగా మారిందన్నారు. పేపర్ లీకేజీ కారణంగా టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి, చైర్మన్, సెక్రటరీని తొలగించి పారదర్శకంగా పరీక్షలను నిర్వహించాలని డిమాండ్ చేసినా పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు గణేష్, హరీష్, అశోక్, వెంకటేష్, మురళి, నవీన్; ప్రవీణ్ ఉన్నారు.

### సమస్యలు పరిష్కరించాలి



సమ్మె చేపట్టిన కంప్యూటర్ ఆపరేటర్లు

గద్వాల అర్బన్: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో పంచాయతీ టెక్నికల్ విభాగంలో పని చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు ఏడు రోజులుగా సమ్మె చేస్తున్నారు. గురువారం సీఎం కేసీఆర్‌కు పోస్టుకార్డు ద్వారా విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో పంచాయతీ రాజ్ డిపార్ట్‌మెంట్‌లో కంప్యూటర్ ఆపరేటర్లుగా పని చేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పే స్కేల్ అమలు చేయాలని కోరారు. సమ్మెలో డీపీఎం రమేష్ బాబు, భార్గవ్ రెడ్డి, నాగరాజు, రాజేష్‌రెడ్డి, జగదీష్ ఉన్నారు.

### పశువుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



ఆవుకు గర్భాశయ పరీక్ష నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

శాంతినగర్: పాడి పశువుల ఆరోగ్యంపై రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యులు డాక్టర్ శిరీష, డాక్టర్ స్వరూపారాణిలు తెలిపారు. వడ్డేపల్లి మండలంలోని కొంకలలో పశుసంవర్ధకశాఖ, పశుగణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పాడి పశువులు, గేదెలకు గర్భాశయ పరీక్షలు చేశారు. వీఎల్ఓ వరప్రసాద్, గోపాలమిత్ర సూపర్‌వైజర్ సూర్యరెడ్డి, ఓఎస్ రవి, గోపాల మిత్రలు నారాయణగౌడ్, భాస్కర్, లక్ష్మన్న, కృష్ణలు పాల్గొన్నారు.

# యువతకు క్రీడల్లో ప్రోత్సాహం



యువకులకు స్పోర్ట్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ

రాజోళి: యువతకు క్రీడల్లో ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తోందని ఎంపీడీఓ గోవిందు రావ్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం స్పోర్ట్స్ కిట్ల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి క్రీడా ప్రాంగణానికి ఒక కిట్ చొప్పున, మండలంలోని ప్రతి క్రీడా ప్రాంగణాలకు కిట్లను అందిస్తున్నట్లు తెలిపారు. కిట్‌లో 20 రకాలకు పైగా క్రీడలకు సంబంధించిన పరికరాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోపాల్, ఎంపీఓ ఖాజా పాల్గొన్నారు.

# నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

శాంతినగర్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 13వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రవీంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వడ్డేపల్లి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ఉంటుందన్నారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజావేదికకు హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మల్దకల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తిగాయపడిన ఘటన మండలంలోని అమరవాయి గ్రామ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. సద్దలోనిపల్లికి చెందిన లక్ష్మన్న సొంత పనుల నిమిత్తం గద్వాలకు వెళ్లి తిరిగి వస్తుండగా, అమరవాయి స్టేజీ సమీపంలో బైక్ అదుపుతప్పి కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే గ్రామస్తులు 108లో గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.